రెండు రోజుల పాటు క్రీడలు

ములుగు రూరల్, ఫిబ్రవరి 10: ఈ నెల 12, 13తేదీల్లో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ములుగు బ్లాక్ లెవల్ క్రీడలు నిర్వహించనున్నట్లు కేంద్రం వలంటీర్ నవీన్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, రన్నింగ్ తదితర పోటీలు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 9502126384, 9505496034 నంబర్లకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న నాయకులు

ఏజెన్సీలో ఇసుక దళారీ వ్యవస్థను నిర్మూలించాలి

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి10 : ఏజెన్సీలో ఇసుక దళారి వ్యవస్థను నిర్మూలించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్మదర్శి పూనెం సాయి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా సాయి మాట్లాడారు. ఆదివాసీ గ్రామాల్లో ఇసుక రీచ్‌ల్లో దళారి వ్యవస్థతో ఆదివాసీలకు అన్యాయం జరుగుతున్నదని ఆరోపించారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని మండలాల్లో పట్టా భూముల పేరుతో అక్రమ ఇసుక క్వారీలకు అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు నరేశ్, చంటి, రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

మంగపేట, ఫిబ్రవరి 10 : ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి ఆర్ఐ శ్రీనివాస్ తక్షణ సాయంగా 25 కిలోల బియ్యం అందజేశారు. మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన గాంధర్ల సమ్మక్క పూరిల్లు సోమవారం దగ్ధమై సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. తహసీల్ కార్యాలయానికి సమాచారం ఇవ్వగా ఆర్ఐ శ్రీనివాస్ గ్రామానికి వెళ్లి ఇంటిని పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, స్థానికులున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10: డిగ్రీ పూర్తి చేసిన జిల్లా మైనార్టీ అభ్యర్థుల నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లాలోని అల్ప సంఖ్యాక వర్గాల నిరుద్యోగులకు గ్రూప్-1, 2, 3, 4, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ పోటీ పరీక్షల కోసం నాలుగు నెలల ఉచిత బేసిక్ ఫౌండేషన్ కోర్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 15లోగా ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారంతోపాటు డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్, స్టడీ సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది
నేను, కేమిడి జయమ్మ W/o యాకయ్య, R/o గ్రా॥ లక్ష్మీనారాయణపురం, మం॥ పాలకుర్తి, జి॥ జనగామ. మాయొక్క విస్నూరు గ్రామ వ్యవసాయ భూమి ఎ. 2-37 గుంటలు, సర్వే నెం. 605, 610, 612, ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 1243/2014 గలదు జనవరి 17న జనగామకు బ్యాంక్‌లోన్ పని నిమిత్తం పోయి వస్తుండగా పోయినది. దొరికినవారు దయచేసి సంప్ర: సెల్: 9347485283, 9182809036

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact: 9949912347, 999896 12347, 63025 53816.**
NTW-332462

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

కాంగ్రెస్ 420 హామీలు ప్రజలకు వివరించాలి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి నాగజ్యోతి

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నాగజ్యోతి

తాడ్వాయి, ఫిబ్రవరి 10 : అధికారం కోసం కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ప్రకటించిన ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రైతులకు రుణమాఫీతోపాటు రైతు భరోసా ఎగ్గొట్టిన ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఆ పార్టీ మోసాలను ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు బీఆర్ఎస్ గెలుపొందేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, మోహన్ రావు, రమణయ్య, లింగయ్య, నర్సయ్య, ఇంద్రారెడ్డి, తిరుపతి, నాగమ్మ, మల్లయ్య, నాగేశ్, దిలావర్‌ఖాన్, లాలయ్య, గోపాల్‌రెడ్డి, స్వరూప, బాబురావు, సయ్యద్ హుస్సేన్, సత్యనారాయణ, విక్రమ్, నరేశ్, సురేశ్, రోశయ్య, రాజబాబు, రోహిత్, రాజేందర్, రామారావు, స్వామి పాల్గొన్నారు.

ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : ప్రజల ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్‌లో బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడుతూ సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిక చేసిన స్థలాల్లోనే చెత్త వేయాలి

వ్యాపారులకు డ్రమ్ములను అందిస్తున్న జీపీ అధికారులు

తాడ్వాయి, ఫిబ్రవరి 10 : మేడారం జాతర పరిసరాల్లో ఏర్పాటు చేసిన స్థలాల్లోనే చెత్త వేయాలని ఎంపీవో పీఎస్ బాబు చిరు వ్యాపారులకు సూచించారు. మినీ జాతర రేపటి నుంచి జరగనుండగా డీపీవో దేవరాజ్ ఆదేశాల మేరకు జాతర పరిసరాల్లోని వివిధ షాపులకు చెత్త వేసేందుకు డ్రమ్ములు పంపిణీ చేసి, ఆయన వ్యాపారస్తులతో మాట్లాడారు. ఎక్కడబడితే అక్కడ కోళ్ల, మేకల వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గద్దెలు, జాతర పరిసరాల్లో ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా మందు పిచికారీ చేయించారు. దుమ్ము లేవకుండా రోడ్లపై నీటిని చల్లుతున్నారు.

ప్రమాద బాధితుడికి ఆపన్నహస్తం

ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

కాటారం, ఫిబ్రవరి 10 : రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన బాధితుడికి ఆపన్నహస్తం అందించారు. నాలుగు రోజుల క్రితం కాటారంలో సబ్ స్టేషన్‌పల్లికి చెందిన తోట రవిని ఇసుక లారీ ఢీకొని ఈడ్చుకెళ్లగా రెండు కాళ్లు కోల్పోయాడు. తెలుసుకున్న చీమల రాజు మిత్రబృందం సహకారంతో సామాజిక మాధ్యమంలో సాయం అందించాలని విజ్ఞప్తి చేశాడు. పలువురు స్పందించి తోచినంతగా సాయం చేయగా సోమవారం రూ.1.55లక్షల నగదు రవి తల్లి రాధమ్మ, కుమారుడు జయకృష్ణకు అందజేశారు. చీమల రాజయ్య, జనగామ కరుణాకర్‌రావు, బచ్చు ప్రకాశ్, కుమార్, రాజేందర్, రమేశ్, సతీశ్, అమీర్ పాల్గొన్నారు.

ఆర్టిజన్ కార్మికులకు యూనిఫాం పంపిణీ

గణపురం, ఫిబ్రవరి 10: మండలంలోని కేటీపీపీలోని ఆర్టిజన్ కార్మికులకు సోమవారం సీఈ చిట్టాప్రగడ శ్రీప్రకాశ్ యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థ కాంట్రాక్టు కార్మికులుగా ఉన్న వారిని ఆర్టిజన్ కార్మికులు (కళాకారులు)గా ఇండస్ట్రియల్ రిలేషన్స్‌లో విలీనం చేసినట్లు చెప్పారు. విద్యుత్ శాఖలో వోఅండ్ ఎం కార్మికుల్లాగే ఆర్టిజన్ కార్మికులకు యూనిఫాం క్లాత్ ఇవ్వాలని కోరగా ఎట్టకేలకు ఆరేండ్ల తర్వాత అందించినందుకు జెన్‌కో, కేటీపీపీ యాజమాన్యానికి, చీఫ్ ఇంజినీర్ శ్రీప్రకాశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సంఘం నాయకులు మామిండ్ల నాగరాజు, బొమ్మకంటి రాజేందర్, బీరెల్లి రాజు, రమేశ్, ధర్మారావు, షిరాజ్, రవీందర్, వేణు, రమేశ్, రాజు, రాకేశ్, నెల్సన్, మల్లయ్య, శ్యాం పాల్గొన్నారు.

యూనిఫాం ధరించిన ఆర్టిజన్ కార్మికులు

నేతకాని కులానికి ప్రత్యేక కోటా కేటాయించాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10 : నేతకానీలకు ప్రత్యేక కోటా, కేటగిరీ కేటాయించాలని తెలంగాణ నేతకాని మహార్ కుల హక్కుల పరిరక్షణ సంఘం సీనియర్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ కుల వర్గీకరణలో నేతకానిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ నేతకాని సామాజిక వర్గం 1,33,000 జనాభా ఉందని ప్రభుత్వం చేసిన ప్రకటనలో వాస్తవాలు లేవన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ మొత్తం జనాభా 18 లక్షలు పైచిలుకు ఉంటుందన్నారు. మూడో కేటగిరీలోకి చేర్చడం వల్ల నేతకాని సమాజానికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందే అవకాశం లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బక్కయ్య, దీగొండ కాంతారావు, కుమ్మరి చంద్రబాబు, కొండగొర్ల పోచయ్య, జిల్లా నాయకులు లక్ష్మీకాంత్, జాడి బోజారావు, బసారికరి నాగార్జున్, శ్రీరాములు, శనేశ్వర్‌రావు, వెంకట్, రాంబాబు, వెంకటేశ్, సంతోష్, నరేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలు

రేగొండ, ఫిబ్రవరి 10 : పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారిపై ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో డ్రైవర్ నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. తిరుమలగిరికి చెందిన ఆటోడ్రైవర్ నరేశ్ పరకాలలో సామాన్లు అప్పగించి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారిపై చలివాగు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టి వెళ్లింది. డ్రైవర్ నరేశ్‌కు తీవ్రగాయాలై స్పృహ కోల్పోగా వాహనదారులు గమనించి 108తోపాటు పోలీసులకు సమాచారం అందించారు. వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 10 : ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, రూట్, సెక్టార్, నోడల్ అధికారులకు కలెక్టర్ ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యా య ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. నామినేషన్లు ప్రక్రియ 10న పూర్తవగా 11న పరిశీలన, 13న ఉప సంహరణ, అభ్యర్థుల తుది జాబితా 13న సాయంత్రం ఫైనల్ అవుతుందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 329 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని చెప్పా రు. ఇందుకు ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 13 మంది పీవోలు, 12 మంది ఏపీవోలు, 24 మంది ఓపీవోలను నియమించినట్లు చెప్పారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, బ్యాలెట్ బాక్సు నిండితే మరో బాక్సు ఏర్పాటు చేస్తే మొదటి బాక్సు నంబర్, పోలింగ్ కేంద్రం నంబర్ స్పష్టంగా రాయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుకు అవకాశం కల్పించామన్నారు. ఈనెల 23 వరకు కలెక్టరేట్‌లోని జీ-5 రూమ్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

పండ్లతోటల రైతులకు బోర్లు మంజూరు చేయాలి

'మా తోట' కార్యక్రమంలో భాగంగా పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు బోర్లు మంజూరు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, మా తోట రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. మహాముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో నాబార్డు ఆధ్వర్యంలో రైతులు పండ్ల తోటలు సాగుచేస్తున్నారని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మొక్కల సంరక్షణకు నీటి సౌకర్యం కల్పించాల్సి ఉన్నందున ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు బోర్లు మంజూరు చేయాలని సూచించారు. మండలంలో 10 బోర్లు మంజూరు చేశామని, వాటిని వెంటనే వేయించాలని ఆదేశించారు. సమావేశాల్లో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డి, శిక్షణ నోడల్ అధికారి, సీపీవో బాబూరావు, ఆర్డీవో రవి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

కాటారం, ఫిబ్రవరి 10 : కాటారం మండలం కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వైర్లు తెగిపడి ప్రమాదం పొంచి ఉన్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైర్లు సరిచేయాలని కోరుతున్నారు.

ఐసీడీఎస్ బిల్లులపై క్షేత్రస్థాయి విచారణ జరపాలి

అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి 10 : మండలకేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2024కు సంబంధించి అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్, డీడబ్ల్యూవో బిల్లులపై క్షేత్ర స్థాయిలో విచారణ జరపాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్కిక సతీశ్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీసీవో సర్దార్‌సింగ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. సతీశ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విధి విధానాలపై, సూపర్‌వైజర్, డీడబ్ల్యూవో 2024-25 నుంచి బిల్లులపై పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

నామినేషన్‌లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

టేకుమట్ల, ఫిబ్రవరి 10 : ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం నల్లగొండలో కూడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్ వేసిన నామినేషన్ కార్యక్రమంలో టేకుమట్ల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. వారిలో మండల నాయకుడు ఆది రఘు, మాజీ సర్పంచ్ ఉద్దమారి మహేశ్, భూపతి సంపత్, మంద రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

తాడిచర్ల లో క్షుద్ర పూజలు

టేకుమట్ల (మల్హార్), ఫిబ్రవరి 10: మల్హార్ మండలం తాడిచర్లలో క్షుద్రపూజలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. తాడిచర్ల పెద్దమ్మ గుడి- తోళ్లపాయ మెయిన్ రోడ్డు నుంచి బీసీ కాలనీకి వెళ్లే మూడు బాటల వద్ద ఎర్ర ముద్ద, పసుపు ముద్దలు, 5 నిమ్మకాయలను విస్తరిలో పెట్టి చుట్టూ పసుపు, కుంకుమ చల్లి గొర్రె పిల్లను బలిచ్చి వదిలేశారు. దీన్ని ఆదివారం ఉదయం ప్రజలు చూసి భయాందోళనలకు గురైయ్యారు.

రాంనగర్ రోడ్డు పనులు పునఃప్రారంభం

'నమస్తే' కథనానికి స్పందన

మెటల్ రోడ్డుపై నీళ్లు పోసి కొనసాగిస్తున్న రోలింగ్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 10 : మండలంలోని దుంపిల్లగూడెం, రాంనగర్ గ్రామాల మధ్య రోడ్డు పనులను కాంట్రాక్టర్ పునఃప్రారంభించారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. దీనికి స్పందించిన అధికారులు ఉదయం దుంపిల్లగూడెం, రాంనగర్ గ్రామాల మధ్య వాటర్ ట్యాంకుతో రహదారిపై నీళ్లు పోయించి రోలింగ్ చేశారు. రోడ్డు నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఏటూరునాగారం ఫిబ్రవరి 10 : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఎస్‌డీవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహ ఆవరణలో సోమవారం వివిధ మండలాల్లోని ఆరు హాస్టళ్లకు చెందిన విద్యార్థులకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు మరో 40 రోజులే ఉన్నాయని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, రేణుక, ఓడెమ్మ, హెచ్ఎం సాంబశివరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ కాలగర్భంలో కలవడం ఖాయం

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 10 : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కాలగర్భంలో కలువడం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు అన్నారు. సోమవారం మండలంలోని ఇప్పలపల్లి, గణేశ్‌పల్లి, గుండ్లకర్తిలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి, ఆయా గ్రామాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేశ్, జిల్లా నాయకులు బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి హాజరై కార్యకర్తలకు మార్గ నిర్దేశనం చేశారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నా రు. బీఆర్ఎస్ పాలనలో పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడితే నేడు కాంగ్రెస్ హయాంలో గ్రామాలు తిరోగమన దిశలో సాగుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పలపల్లి గ్రామ అధ్యక్షుడిగా ఆకుతోట తిరుపతి, ఉపాధ్యక్షుడిగా సరిగొమ్ముల రాజు, రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా గడ్డి మల్ల య్య, సహాయక కార్యదర్శిగా ముద్రకోల మొగిలి, కోశాధికారిగా శ్రీపతి చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శిగా బండి నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా కొండ్ర మల్లయ్య, గణేశ్‌పల్లి అధ్యక్షుడిగా కొడగాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గుమ్మడెల్లి రవి, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ గఫూర్, యూత్ అధ్యక్షుడిగా ఎర్ర బాటి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ సల్మాన్, ఉపాధ్యక్షుడిగా వంగ రమేశ్, గుండ్లకర్తి అధ్యక్షుడిగా చెలిక సురేశ్, ప్రధాన కార్యదర్శిగా భిక్షపతి, యూత్ అధ్యక్షులుగా మురారి హరికృష్ణ, మాజీ సర్పంచ్ కోరికల తిరుపతి, లింగంపల్లి సంజీవరావు, మట్టిక రాజు, సత్యారావు, గూడపు వేణు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం మండల మాజీ ఉపాధ్యక్షుడు రాములు, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ బైరగొని లవయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటస్వామి, సంపత్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులతో టీచర్లు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 10 : మండలంలోని చల్వాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. 4,5వ తరగతి విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. హెచ్ఎం హట్కర్ సమ్మయ్య, ఉపాధ్యాయులు వాసుదేవ రెడ్డి, మాధవి, లత, రాణి, పావని, స్రవంతి, మమత పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న శివకృష్ణ

గోవిందరావుపేట, ఫిబ్రవరి 10 : ఆయిల్ పామ్ సాగుపై మండలంలోని రైతు వేదికలో అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేఎన్ బయో సైన్సెస్ ఫీల్డ్ ఆఫీసర్ శివకృష్ణ ఆయిల్ పామ్ పంటలో చీడ పీడలు, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలు అందజేశారు. రైతులకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఎలాంటి సమస్య వచ్చినా సంప్రదించాలని సూచించారు. రైతులు అంతిరెడ్డి, అంకం రాజు, కనకయ్య, బుచ్చయ్య, వీరరాఘవులు, సత్యనారాయణ, రుద్రబోయిన మల్లేశ్ పాల్గొన్నారు.

కుడి కాల్వ బ్రిడ్జి స్లాబ్‌కు మరమ్మతులు చేపట్టాలి

గోవిందరావుపేట, ఫిబ్రవరి10 : మండలంలోని కర్లపల్లి సమీప గుండ్ల వాగు ప్రాజెక్టు కుడి కాల్వపై వేసిన స్లాబ్‌కు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. సాగు నీరు అందించేందుకు అధికారులు పైప్‌లైన్లు అమర్చారు. దానిపై స్లాబ్ వేయడంతో ఇటీవల కురిసిన వర్షాలతో మొత్తం కూలిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా భీమ్‌నాయక్ కుంట కింద సాగయ్యే పొలాల రైతులు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిపై స్లాబ్ వేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గిరిజన సహకార సంఘ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

మాట్లాడుతున్న డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి శైలజ

మహదేవపూర్, ఫిబ్రవరి 10 : గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘం పాలక మండలి ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదలైందని డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి శైలజ తెలిపారు. సోమవారం జీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయని, ఐదు గురు పాలకవర్గ స్థానాలకు జనరల్ (3), మహిళ(2) రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. మండలకేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో ఈనెల 13 నుంచి 15 వరకు నామినేషన్ పక్రియ, 16న పరిశీలన, 17